# రాఫెల్ ఒప్పందం : ప్రజాధనం లూటీ

**ఉన్నత** స్థానాల్లో అవినీతి ఏ స్థాయిలో వుందో, భారత బడా బూర్జువావర్గం దేశ సంపదను ఏవిధంగా లూటీ చేస్తోందో రాఫెల్ ఒప్పందం ఉదంతం మరోసారి వెల్లడి చేసింది. అది ఒక్కటి మాత్రమే గాకుండా రైఫిల్స్ మొదలుకొని యుద్ధ విమానాల అవసరాల వరకు భారతసైన్యం కొన్ని సామ్రాజ్యవాద దేశాలపై ఏవిధంగా ఆధారపడి వుందో కూడా ఈ ఉదంతం తేటతెల్లం చేస్తోంది.

2007లో భారత వాయుసేన 126 ఫైటర్ జెట్‌లతో కూడిన 42 స్క్వాడ్రన్స్‌గా తాము రూపొందాల్సి వుందని పేర్కొంది. 2012 సం॥లో నాటి యుపిఏ ప్రభుత్వం దస్సాల్ట్ కంపెనీకి చెందిన రాఫెల్‌ను ఎంపికచేసి, 108 యుద్ధ విమానాలను భారతదేశానికి సరఫరా చేయాలని, మనదేశంలోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) సహ భాగస్వామిగా వీనిని ఉత్పత్తి చేయాలని అవగాహనా ఒప్పందంపై సంతకం చేసింది. మరో 18 యుద్ధ విమానాలు నేరుగా ప్రయోగించే విధంగా కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది.

ప్రధానమంత్రి మోడీ 2015 సం॥లో ప్యారిస్ సందర్శించినపుడు ఈ అవగాహనా ఒప్పందాన్ని రద్దుచేసుకొని, 21 వేల కోట్లరూపాయల ఖరీదుతో 36 రాఫెల్ యుద్ధ విమానాలను నేరుగా ప్రయోగించే విధంగా సరఫరా చేయాలని దస్సాల్ట్‌తో నూతన ఒప్పందం చేసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వ 'హాల్' స్థానంలో అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్ 50 శాతం వాటాతో సహభాగస్వామిగా రంగంలోకి వచ్చింది.

2015లో అవగాహనా ఒప్పందంపై సంతకం చేసిన మాజీ ఫ్రెంచ్ అధ్యక్షుడు ఫ్రాంకోసిస్ హాలండ్, రాఫెల్ ఒప్పందంలో భారతదేశపు భాగస్వామిని భారత ప్రభుత్వమే ప్రతిపాదించిందని, ఆ అంశంలో కలుగజేసుకునేందుకు తమకేమీ అవకాశంలేదని చాలా స్పష్టంగా పేర్కొన్నాడు.

భారత రక్షణశాఖా మంత్రి మాట్లాడుతూ రాఫెల్ ఒప్పందంలో భారతదేశపు భాగస్వామిని ఎంపికచేసేది దస్సాల్ట్ కంపెనీ మాత్రమేనని, భారత ప్రభుత్వం దానికి ఆమోదం మాత్రమే తెలుపుతుందని పేర్కొన్నారు. అయితే, సహ భాగస్వామికి చెందిన చర్చలు ముందుకు సాగలేదని, 'హాల్' వద్ద మౌలిక వసతుల కొరత కారణంగా ఒప్పందంలో ఈ మార్పు జరిగిందని భారత ఆర్థికశాఖామంత్రి వివరణ ఇచ్చారు. రష్యా అనుమతి పత్రం కలిగివుండి 'మిగ్' మరియు 'సుఖోయ్'-20 యుద్ధ విమానాలను ప్రభుత్వరంగ సంస్థ 'హాల్' కూర్పుచేస్తోంది. కాగా, 'హాల్' ఉన్నతాధికారి ఈ అంశంపై బహిరంగంగా మాట్లాడుతూ తమకు మౌలిక వసతుల అంశంలో లోటేమీలేదని స్పష్టంచేశాడు. దస్సాల్ట్‌తో మొదటి అవగాహనా ఒప్పందాన్ని రద్దుచేసుకోవటానికి మౌలిక వసతుల కొరతే కారణమయ్యేట్లయితే, మోడీ ప్యారిస్ పర్యటనకు కేవలం ఓ వారం రోజుల ముందు మాత్రమే రిజిస్టర్ అయిన, రక్షణ ఉత్పత్తుల తయారీలో ఎలాంటి అనుభవంలేని 'రిలయెన్స్ డిఫెన్స్ లిమిటెడ్' (RDL) ఏవిధంగా ఆ మౌలిక వసతులను కలిగివుంటుందని ఆయన ప్రశ్నించాడు.

అంతేగాక, నూతన అవగాహనా ఒప్పందంలో రాఫెల్ యుద్ధ విమానం ఖరీదు, మొదటి ఒప్పందంలో పేర్కొన్న ధరకు రెండు రెట్లు అధికంగా వుంది. మోడీ ప్రభుత్వం ఈ ధరల వివరాలను పార్లమెంటు ముందుంచటానికి మాత్రం ససేమిరా నిరాకరిస్తోంది. 'క్విడ్ ప్రోకో' ఆధారంగా అదనపు డబ్బు ఏవిధంగా బదిలీ అయిందో పత్రికా వార్తలు ఆలస్యంగానైనా వెలుగులోకి వస్తున్నాయి. కాపలా కాయటమే తన పనిగా చెప్పుకున్న 'చౌకీదార్', ప్రజాధనాన్ని లూటీచేయడంలో సహభాగస్వామి 'భాగీదార్'ను ఎన్నుకున్నాడు.

ఈ ఉదంతం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. భారత వైమానిక దళం 126 జెట్ యుద్ధవిమానాలు అవసరం అని పేర్కొనగా, ఒక దశాబ్దకాలం తర్వాత, వాటిలో 36 విమానాలు ఐఎఎఫ్‌కు ఇంకా చేరవలసే వుంది. 42 స్క్వాడ్రన్స్‌కు తగిన విధంగా యుద్ధవిమానాలను అందజేయటానికి మరెన్ని దశాబ్దాలు పడుతుంది? ఉదాహరణకు, శత్రువు దాడికే తలపడేట్లయితే తక్కువ ఆయుధ బలగాలతో వైమానిక దళం ఏవిధంగా తనను రక్షించుకోగలుగుతుంది? ఆ మిగతా యుద్ధ విమానాలు అమెరికా సామ్రాజ్యవాదం నుండి సేకరిస్తారా? ఇటీవలి కాలపు అమెరికాతో సైనిక రక్షణ ఒప్పందం ప్రకారం, అమెరికా విధించిన ఆంక్షల కారణంగా రష్యానుండి భారతదేశం మిలటరీ యుద్ధ పరికరాలను కొనుగోలు చేయజాలదు.

రక్షణ ఉత్పత్తులను ప్రైవేటీకరించే ఎన్‌డిఏ ప్రభుత్వ ప్రయత్నంలో భాగంగా దీనిని చూడాలి. బాగా ప్రచారం కల్పించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భారత ప్రభుత్వం, రక్షణ ఉత్పత్తుల తయారీకి విదేశీ కంపెనీలను అనుమతించింది. ఆవిధంగా ముందుకొచ్చిన ప్రాజెక్టులలో అత్యధికమూ, రానున్న కంపెనీలలో అత్యధికం కూడా పూర్తిగానో, పాక్షికంగానో దిగుమతి చేసుకున్న విడిభాగాలను కూర్పుచేసే అసెంబ్లింగ్ ప్లాంటులు తప్ప మరోటి కావు. పైగా ఎన్‌డిఏ ప్రభుత్వం యుద్ధ సామాగ్రి కర్మాగారాలను రక్షణ ఉత్పత్తులనుండి విడగొట్టే క్రమాన్ని ప్రారంభించింది.

మన్మోహన్‌సింగ్ రూపొందించిన పదమైన 'క్రోనీ క్యాపిటలిజమ్' తప్ప ఇది వేరు కాదు. ఇది భారత ఆర్థికవ్యవస్థలో భాగమై వుంది. ప్రజాధనాన్ని లూటీ చేసుకోవడంద్వారా భారత బడా బూర్జువావర్గం పెరుగుతోంది. అందుకే దీనిని మనం నిరంకుశాధికార పెట్టుబడిదారీ వర్గం అని పిలుస్తాము. తాజా ఉదాహరణలు చూద్దాం. ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్య నమూనాలో 14 ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులు విఫలం కావటానికే రూపొందించబడి, బ్యాంకింగ్ విభాగంలో నిరర్థక ఆస్తుల(ఎన్‌పిఏ)లో అధికభాగంగా తయారయ్యాయి. ప్రభుత్వం ఈ నిరర్థక ఆస్థులన్నింటినీ రద్దుచేసే చర్యలు తీసుకొని, లూటీ చేసిన వారిని రక్షించేందుకు ప్రభుత్వ ఖజానానుండి వారికి చెల్లిస్తోంది. అలాగే గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలుగా పిలువబడేవి కూడా సంక్షోభం నుండి ఈ విధంగానే బయటకు లాగబడ్డాయి. ప్రస్తుతం ఇంధనరంగంలోనూ అదే సాగుతోంది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యపు నమూనాలోని ప్రాజెక్టులను మోడీ ప్రభుత్వం ఎంతకైనా దిగజారి జాతీయ ప్రయోజనాల పేరిట వాటిని కాపుగాస్తోంది. భారత పారిశ్రామిక దిగ్గజాలుగా పేర్కొనబడుతున్న అంబానీలు, అదానీలు, టాటాలు, జిందాల్, బిర్లాలు-ప్రజాధనం లూటీలో అధికవాటాను ఎగరేసుకుపోతున్న వారిగా వున్నారు.

ఎన్నికలు సమీపిస్తుండటంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వత్తిడిలో వుంది. ఈ సమయంలో రాఫెల్ ఒప్పందం ఉదంతం ప్రజలకు మరింత చేరువవుతుందేమోనని గాభరా చెందుతోంది. అబద్ధాలను, అర్థసత్యాలను వ్యాపింపజేయడానికి అది చేసిన ప్రయత్నాలన్నీ ఘోరంగా విఫల మయ్యాయి. అది తిరిగి జాతీయోన్మాద కొరడా ఝుళిపించే మార్గం తీసుకొంటోంది. సర్జికల్ దాడులుగా పిలవబడే వాని ఉత్సవాలు నిర్వహించటం, పాకిస్థాన్ వ్యతిరేక భావోద్వేగాలను రేపటానికి మరో సర్జికల్ దాడిని గురించిన ఎడతెగని చర్చలు సాగించటం వంటివన్నీ తన పరిపాలన ఫలితంగా ప్రజాజీవితంలో తలెత్తిన తీవ్రసమస్యలనుండి, ప్రాధమిక ప్రశ్నలనుండి ప్రజల దృష్టి మళ్ళించే కుట్రపూరిత క్రీడలో భాగమే.

ooooo